క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

మల్దకల్: మండల పరిషత్ సమావేశపు హాల్లో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ రాజారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణయ్య తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని వినతి

గద్వాల అర్బన్: గద్వాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరఫున తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కురువ విజయ్‌కుమార్ గురువారం ఢిల్లీలో కాంగ్రెస్ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ సభ్యులు బాబ సిద్దికి, జిగ్నేష్ మేవానిని కలిసి విన్నవించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

అలంపూర్: నియోజకవర్గంలో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఒక ప్రకటనలో తెలిపారు. ఇటిక్యాల మండలం కేంద్రంలో ఉదయం 10 గంటలకు రూ.2.2 కోట్లతో ఆర్అండ్‌బీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తారని తెలిపారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు 80 మంది లబ్ధిదారులకు రూ. 33,85,200 సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తారని తెలిపారు.

తిరుమలలో పచ్చర్ల భజన బృందం

రాజోళి: హిందూ ధర్మప్రచారంలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం పలు కార్యక్రమాలు చేపట్టింది. అందులో భాగంగా తిరుమలలో నిర్వహిస్తున్న భజనలో మండలంలోని పచ్చర్ల గ్రామానికి చెందిన పరశురామ భజన బృందం పాల్గొన్నది. భజనల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన బృందానికి గ్రామస్తులు, మండల ప్రజలు అభినందనలు తెలిపారు.

కల్వర్టు ప్రమాదకరం



మానవపాడు: కల్వర్టు ప్రమాదకరంగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని మానవపాడు నుంచి గోకులపాడు మీదుగా వాగుపై మినీ వంతెన నిర్మించారు. ఈ వంతెనపై గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. మానవపాడు నుంచి గోకులపాడు, వయా కొర్విపాడు, చంద్రశేఖర్‌నగర్, శ్రీనగర్, మద్దూరు, కలుకుంట్ల గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని మండల ప్రజలు పేర్కొన్నారు. ప్రమాదాలు జరుగకముందే కల్వర్టు నిర్మించాలని కోరుతున్నారు.

రుణమాఫీపై సందిగ్ధం

గద్వాల అర్బన్: ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీపై జిల్లా వ్యవసాయశాఖ అధికారులు క్లారిటీ ఇవ్వడం లేదని బహుజన సేన జిల్లా అధ్యక్షుడు దానయ్య అన్నారు. జిల్లాలో మరణించిన రైతుల ఖాతాల్లో ఇప్పటి వరకు డబ్బు జమ కాలేదని, దీనిపై వ్యవసాయశాఖ అధికారులు, బ్యాంకు అధికారులు స్పష్టమైన మార్గదర్శకాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సంబంధిత అధికారులు గైడ్‌లైన్స్ ఇవ్వాలన్నారు. సమావేశంలో రాముడు, అజయ్, విజయ్, సంజీవ్ ఉన్నారు.

'సమగ్ర శిక్ష' ఉద్యోగుల దీక్ష విరమణ

గద్వాల: జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు దీక్షను విరమించారు. తమ ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని, తక్షణమే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ 19 రోజులుగా సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు రిలే దీక్షలు చేపట్టారు. గురువారం దీక్ష శిబిరంలో ఉద్యోగులు ప్లకార్డులు చేతపట్టి నిరసన వ్యక్తం చేశారు. విద్యాశాఖ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ సిరాజుద్దీన్ నేరుగా దీక్ష శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లపై ఎస్పీడీ సానుకూలంగా స్పందించారని, తక్షణమే దీక్షలను విరమించాలని డీఈఓ కోరారు. అందుకు సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలు, వారిపై నమ్మకంతో తాత్కాలికంగా దీక్షను విరమిస్తున్నట్లు ప్రకటించారు.

మానవత్వం చాటుకున్న శాంతినగర్ వాసి



శాంతినగర్: రక్తం అందుబాటులో లేక ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న ఓ వ్యక్తికి శాంతినగర్‌కు చెందిన రామాంజనేయగౌడ్ రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నాడు. పెబ్బేరుకు చెందిన వ్యక్తి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బ్లడ్ కావాలని ఆయన భార్యకు వైద్యులు సూచించారు. దీంతో ఆమె ఆందోళనకు గురై రక్తం ఎలా తేవాలని విలపిస్తూ కూర్చున్నది. బంధువు ఆస్పత్రిలో ఉండటంతో పరామర్శించడానికి వెళ్లిన రామాంజనేయులుగౌడ్ ఆమె ఆవేదనను గమనించి వివరాలు తెలుసుకున్నాడు. వెంటనే స్పందించిన ఆయన డాక్టర్లతో మాట్లాడి రక్తం ఇచ్చి నిరుపేద ప్రాణాలు కాపాడాడు.

వసతుల్లేని జాతీయ రహదారి

- ప్రయాణికులు లేని హైవే బస్‌షెల్టర్లు
- మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక అవస్థలు
- తాగునీటి ట్యాంకులున్నా నిరుపయోగమే!



నిత్యం వేలమంది ప్రయాణికులతో రద్దీగా ఉండే ఎర్రవల్లి చౌరస్తా

ఎర్రవల్లిచౌరస్తా: నిత్యం వాహనాల చప్పుడుతో 44వ జాతీయ రహదారి రద్దీగా ఉంటుంది. అలాంటి జాతీయ రహదారిపై ప్రయాణికులు, వాహనదారులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా అధికారులు నిత్యం రోడ్డును పర్యవేక్షించి సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుంది. రోడ్ల నిర్మాణ సమయంలోనే రక్షణ చర్యలతో పాటు, వాహనాలు నిలుపుటకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రధాన కూడళ్లలో బస్‌షెల్టర్లు, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, అత్యవసరమైన కనీసవసతులు కల్పించాల్సి ఉంటుంది. అలంపూర్ నియోజకవర్గంలో 44వ జాతీయ రహదారిపై కనీస వసతు కల్పనలో హైవే అధికారులు పూర్తిగా విఫలమైనట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రద్దీగా ఉండే కూడళ్లు

44వ జాతీయ రహదారి బీచుపల్లి బ్రిడ్జి నుంచి పుల్లూరు స్టేజీ వరకు సుమారు 46 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. రహదారిపై మొత్తం 25 బస్ షెల్టర్లు ఉండగా అందులో చాలా వరకు నిరుపయోగంగా ఉన్నాయి. బీచుపల్లి, ఎర్రవల్లిచౌరస్తా, కోదండాపురం స్టేజీ, పొగాకు కంపెనీ, మానవపాడు స్టేజీ, జల్లాపురం స్టేజీ, అలంపూర్ చౌరస్తా, పుల్లూరు స్టేజీ వంటి ప్రధాన కూడళ్లు ఉన్నాయి. ఈ కూడళ్ల ద్వారా నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. ఈ కూడళ్ల వద్ద బస్ షెల్టర్లు, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మహిళా ప్రయాణికుల బాధలు అత్యవసర పరిస్థితుల్లో వర్ణనాతీతంగా ఉన్నాయి.



నిరుపయోగంగా ఉన్న బీచుపల్లి బస్‌షెల్టర్



ముళ్లపొదలలోకి చేరిన కొండపేట తాగునీటి వాటర్ ట్యాంకు

నిరుపయోగంగా బస్‌షెల్టర్లు, ట్యాంకులు

జాతీయ రహదారిపై బస్ షెల్టర్లు, తాగునీటి ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. రహదారిపై ప్రధాన కూడళ్లలో కాకుండా రెండు వందల నుంచి మూడు వందల మీటర్ల దూరంలో బస్ షెల్టర్లు నిర్మించారు. అవి ప్రయాణికులకు ఉపయోగపడటం లేదు. తాగునీటి ట్యాంకులు ఏర్పాటు చేసినా వాటిలో నీటిని నింపకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. కనీస వసతులు కల్పించాలని పలు మార్లు హైవే అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రధాన కూడళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టి కనీస వసతులు కల్పించాల్సి ఉంది.

హైవే అధికారులు చర్యలు తీసుకోవాలి



జాతీయ రహదారిపై ప్రయాణికులకు అవసరమైన వసతుల కల్పనలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ప్రయాణికులు జాతీయ రహదారిపై ప్రయాణించాలంటే నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూడళ్లలో ప్రయాణికులకు నీడతో పాటు, తాగునీటి వసతి కల్పించాలి.

– రవికుమార్, వాహనదారుడు

వసతులు కల్పించాలి..



ఎర్రవల్లి, బీచుపల్లి, అలంపూర్ కూడళ్లలో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో రోడ్డు పక్కన వాహనాలు ఆపడంతో నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధాన కూడళ్లలో పార్కింగ్ స్థలాలు, మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటుకు హైవే అధికారులు స్పందించి కృషిచేయాలి.

– మారుతి, ప్రయాణికుడు

కొనసాగుతున్న దర్గా ఉత్సవాలు



అయిజ: మండల కేంద్రంలోని పర్దీపురం సమీపంలో హజరత్ ఖాజా సయ్యద్ బాబా ఫకీర్‌వలీ దర్గా ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం రాత్రి గంధం ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఫాతెహా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఉత్సవాలకు తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఉత్సవ నిర్వాహకులు భోజన వసతి కల్పించారు.

ఆశా వర్కర్ల సమ్మె నోటీసు అందజేత



రాజోళి: ఈనెల 25 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్లు చేస్తున్న సమ్మెలో భాగంగా మండలంలోని ఆశా వర్కర్లు సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారు గురువారం తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మకు సమ్మె నోటీసు అందజేశారు. వెంటనే తమ డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. కేవీపీఎస్ మండల నాయకులు విజయ్ కుమార్, లక్ష్మన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు చేయించుకోవాలి



మల్దకల్‌లో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ స్వరూపారాణి

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాల సంఖ్యను మరింత పెంచాలని డాక్టర్ స్వరూపారాణి వైద్యసిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు చేసి వైద్యసిబ్బందితో మాట్లాడారు. గ్రామాల్లో బీపీ, షుగర్, పరీక్షలు నిర్వహించడంతో గర్భిణులు నెలనెలా వైద్యపరీక్షలు చేయించుకునే విధంగా అవగాహన కల్పించాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఉన్నారు.

కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలి

అయిజ: మున్సిపల్ కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నర్సయ్యకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు మహేంద్ర, నరేష్, నాగరాజు, పరమేష్; అడివన్న, వీరేష్, అశోక్, రాజు, యువరాజు, ప్రకాష్, రాకేష్, పార్వతమ్మ, సుశీల పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఘనంగా ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీకి చెందిన కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. అనంతరం అందరు ఎమ్మెల్యే జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పాతబస్టాండులో కేసీఆర్ క్యాంటీన్ వద్ద అభిమానులు కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు, పలువురు ప్రభుత్వ ఉద్యోగులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు

కేటీదొడ్డి: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా గురువారం మండలంలోని వెంకటాపురంలోని శ్రీపాగుంటలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైస్‌ఎంపీపీ రామకృష్ణ నాయుడు, మండల అధ్యక్షుడు ఉరుకుందు ఎమ్మెల్యే పేరుమీద అర్చన, పూజలు చేయించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు హనుమంతు, మండల ఉపాధ్యక్షుడు వెంకటేష్‌గౌడు, సర్పంచు ఆంజనేయులు, నాయకులు గోపి, తిక్కన్న, గోపాల్, రాజు, ఖర్‌రెడ్డి, రాజేష్, ప్రసాద్, పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కేటీదొడ్డి: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని మండలంలోని వెంకటాపురంలో బీఆర్ఎస్ నాయకుడు గోపి ఆధ్వర్యంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఈశ్వర్, ఉపాధ్యాయుడు రాము ఉన్నారు.


గెలుపోటములు సమానంగా తీసుకోవాలి

మల్దకల్: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఎంపీపీ రాజారెడ్డి, గద్వాల ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి క్రీడాకారులకు సూచించారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలను గురువారం మండల కేంద్రంలోని క్రీడాప్రాంగణంలో ప్రారంభించారు. 12 మండలాలకు చెందిన అండర్ 14, అండర్ 17 వాలీబాల్ క్రీడకారులు పాల్గొన్నారు. క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. క్రీడాకారులు మండల, జిల్లా స్థాయిలో కాకుండా జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. పోటీలలో ఎంపికైన వాలీబాల్ జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పెద్ద వీరన్న, వెంకటన్న, నరేందర్, అజయ్, మధు, నారాయణ, ఎస్‌జీఎఫ్ ఆనంద్, జితేందర్, సహాసిని, పీఈటీలు స్వప్న, వెంకట్రాములు, తిమ్మప్ప, తిరుమలేష్ పాల్గొన్నారు.



వాలీబాల్ జట్టుతో ఎంపీపీ రాజారెడ్డి, గద్వాల ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి

దళితుల జీవితాలు మారలే



ఎర్రవల్లిచౌరస్తా: 70 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో దళితుల బతుకులు ఏమాత్రం మారలేదని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఎంజీ కృష్ణ అన్నారు. గురువారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎస్పీ అభివృద్ధిని చూసి ఓర్వలేక కాంగ్రెస్ పార్టీ ఎస్ఆర్ఐలతో దుర్భాషలాడిస్తోందని మండిపడ్డారు. విద్యార్థులను వివిధ రంగాల్లో అభివృద్ధి చేసిన ఆర్ఎస్పీ గురించి ఎస్ఆర్ఐ రాజబోడ మాట్లాడటం విడ్డూరమన్నారు. ప్రజలే వారికి ఎన్నికల్లో తగిన సమాధానం చెప్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపాల్, శరత్, ముప్పారపు ఉన్నారు.

10 మంది బైండోవర్

కేటీదొడ్డి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 10 మందిని గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుల బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన నాటు సారా, మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో బైండోవర్ కేసులు నమోదు చేసి, సారా తయారీదారులను తహసీల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు తెలిపారు. మండలంలోని బెల్ట్ షాపులను తనిఖీ చేశారు. వారి వెంట ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ముందు బైండోవర్ చేసిన అధికారులు

చిరుధాన్యాల్లో పోషకాలు



గట్టు: చిరు ధాన్యాల్లో అనేక పోషకాలున్నాయని, ప్రతి ఒక్కరూ చిరు ధాన్యాలను తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర వాసంతి తెలిపారు. గురువారం ఇందువాసి సెక్టారులోని తారాపురంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాసంతి మాట్లాడుతూ మహిళల్లో రక్తహీనతను దూరం చేద్దామన్నారు. మహిళలు సరైన పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను దూరం చేయొచ్చన్నారు. సర్పంచు నల్లన్నగౌడు, అంగన్‌వాడీ టీచర్ మహేశ్వరి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. గట్టు బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ సుజాతమ్మ గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

ఏబీహెచ్‌ఏ కార్డుపై అవగాహన



అయిజ: ప్రజలు ఏబీహెచ్ఏ (ఆయిష్మాన్ భారత్ హెల్త్ అవేర్‌నెస్ కార్డ్)పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మెడికల్ ఆఫీసర్ విష్ణు కోరారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మెడికల్ ఆఫీసర్ పీహెచ్ సిబ్బందితో కలిసి గర్భిణులకు, బాలింతలకు, ఔట్ పేషెంట్‌లకు ఏబీహెచ్ఏ కార్డు తీసుకునే విధానంపై వివరించారు. వైట్ రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఏబీహెచ్ఏ కార్డు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వందేభారత్ రైలు నిలపాలి

గద్వాల అర్బన్: వందేభారత్ రైలు గద్వాల రైల్వే స్టేషన్‌లో నిలిపి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకరావాలని గురువారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే మేనేజర్‌కు లేఖ రాశారు. ఈ లేఖను రిజిస్టర్ పోస్టు ద్వారా సౌత్ సెంట్రల్ మేనేజర్‌కు పంపించినట్లు ఆమె తెలిపారు.

నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి

మానవపాడు: వినాయకుని ఊరేగింపులో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రాము తెలిపారు. గురువారం మండలంలోని వినాయక నిమజ్జనాలు, వాటి జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వినాయకుని నిమజ్జనానికి తరలించే సమయంలో డీజేలు పెట్టొద్దని హెచ్చరించారు. శోభాయాత్ర నిర్వహించే సమయంలో వినాయని విగ్రహాలు విద్యుత్ తీగలకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలంలోని విగ్రహాలు నిమజ్జనానికి తరలిస్తున్న సమయంలో నిబంధనలు పాటించాలని సూచించారు.

వ్యాయామం ఆరోగ్యానికి మంచిది



మానవపాడు: యోగా, వ్యాయామం ఆరోగ్యానికి మంచిదని డాక్టర్ రిజ్వానా తస్వీర్ తెలిపారు. గురువారం మండలంలోని బోరవెల్లి, మానవపాడు హెల్త్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, చంద్రన్న, సంధ్యారాణి, పరిమళ, అనూష, జయమ్మ, రేవతి, ఆశా వర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు రిజర్వేషన్ కల్పించాలి

శాంతినగర్: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని పార్లమెంట్ ఆమోదం తెలపడంతో రిజర్వేషన్లలో ఎస్సీ, బీసీ, ఎస్టీ మహిళలకు 90 శాతం అమలు చేయాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి అలంపూర్ నియోజకవర్గ సమన్వయకర్త నాగేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శాంతినగర్‌లో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. అలంపూర్ నియోజకవర్గ సమన్వయ కర్త గౌనింటి వీరేష్, వెంకటేష్, వీరేష్, సాయి, అజయ్, సురేష్, రోహన్, వినోద్, రామాంజనేయులు, రాముడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేష్‌యాదవ్

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

శాంతినగర్: ఎస్సీ కులాల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం శాంతినగర్‌లో రాస్తారోకో చేపట్టారు. అలంపూర్-రాయచూర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామని బీజేపీ నాయకులు హామీ ఇచ్చి మోసం చేశారని, ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో వెంటనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులకు మద్దతుగా ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ రాస్తారోకోలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ డేవిడ్ డిమాండ్ చేశాడు. గురువారం మండల కేంద్రంలో దీక్ష కొనసాగించారు. నాయకులు జంబయ్య, నర్సింహులు, తాయప్ప, విష్ణు, హనుమంతు పాల్గొన్నారు.



శాంతినగర్‌లో రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మత్స్యకారులకు చేయూత

గట్టు: తెలంగాణ ప్రభుత్వం మత్స్యకారులకు చేయూతను అందిస్తున్నట్లు వైస్ ఎంపీపీ సుమతి తెలిపారు. గురువారం స్టేట్ ఫిషరీస్ ఇన్ఫర్మేషన్ మెనేజ్‌మెంట్ సిస్టం ద్వారా బోయలగూడెంలో నూతనంగా మత్స్యకారుల సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సుమతి మాట్లాడుతూ మత్స్యకారులకు తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను సరఫరా చేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాణి, ఉప సర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీ నర్సప్ప, కార్యదర్శి గోపీనాథ్, మత్స్యకార సంఘం అధ్యక్షుడు చిన్న తిమ్మప్ప, రామాంజనేయులు, ఖాసీం, బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు.



బోయలగూడెంలో సభ్యత్వ నమోదును చేపట్టిన అధికారులు

మూలమలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

మానవపాడు: మండలంలోని జాతీయ రహదారికి వెళ్లే దారిలో మూల మలుపులు ప్రమాదకరంగా ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. జూరాల కాలువ 31 కల్వర్ట్‌పై చుట్టూ గోడలు చిన్నగా ఉన్నాయి. మూలమలుపుల వల్ల ప్రమాదాలు జరిగి ఇప్పటికే ముగ్గురు మరణించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సూచిక బోర్డులు, కాలువపై చుట్టూ కంచెలాగా నిర్మాణాలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మానవపాడు కాలువ వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులు

పార్లమెంట్‌లో ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలి

ఎర్రవల్లిచౌరస్తా: కేంద్ర ప్రభుత్వం మాదిగలపై మొండి వైఖరిని వీడి వెంటనే పార్లమెంట్‌లో ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజేష్ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గురువారం ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి కృష్ణానది బ్రిడ్జిపై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి దిగ్బంధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో ఏబీసీడీ వర్గీకరణపై ఒక్క ఎంపీ కూడా మాట్లాడక పోవడం ఎంతో బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా మాదిగలకు ఇచ్చిన మాట ప్రకారం ఏబీసీడీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఏకగ్రీవ తీర్మానం చేసి మాదిగలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రహదారి దిగ్బంధంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఇటిక్యాల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వారిని అక్కడి నుంచి తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జయరాజ్, పరశురామ్, ఆంజనేయులు, శ్రీను, సంతోష్, నాగరాజు, చెన్నకేశవులు, ఉదయ్, పరుశరాం, రమేష్ ఉన్నారు.



ఎమ్మార్పీఎస్ నాయకులను తరలిస్తున్న పోలీసులు

ఆర్థికసాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఉదండాపురం గ్రామానికి చెందిన ఎరుకలి రాముడు, బుడ్డ మద్దిలేటి ఇద్దరు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు గురువారం ఉదండాపురానికి వెళ్లి బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం రూ. 5వేల చొప్పున ఇరుకుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో సేవాదళం సభ్యులు ఉన్నారు.



ఉదండాపురంలో ఆర్థికసాయం అందిస్తున్న సేవాదళం సభ్యులు